ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 14 అక్టోబరు 2025



బోధన బాట

● విధుల్లో చేరిన కొత్త గురువులు

కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో కొలువు సాధించి, శిక్షణ పొందిన కొత్త గురువులు సోమవారం విధుల్లో చేరారు. తమకు కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ కలను సాకారం చేసుకున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో అన్ని మేనేజ్‌మెంట్‌ల్లో మొత్తం 578 మంది పోస్టింగ్ పొందారు. కాగా 266 ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల విభాగంలో సోషల్ స్టడీస్ 67, ఫిజిక్స్ 56, బయాలజీ 36, గణితం 33, తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 30, ఫిజికల్ డైరెక్టర్ 62 పోస్టులకు సంబంధించి కొత్త గురువులకు పాఠశాలలను కేటాయించారు. నిర్ణీత వ్యవధిలో పరీక్షలు నిర్వహించి, పోస్టింగ్‌లిచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.



పేద పిల్లలను తీర్చిదిద్దుతాను

బొబ్బిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'పేద పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవసరమైన బాటలు వేస్తాను. వారిని అన్ని విధాలా తీర్చిదిద్దుతాను' అని కొత్త ఉపాధ్యా యుడు బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్‌కు చెందిన బంకురు రాకేష్ తెలిపారు. గొల్లపల్లి వేణుగోపాల మునిసిపల్ హైస్కూలులో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా సోమవారం ఉద్యోగంలో చేరారు. ఇదే స్కూలులో తండ్రి రామకృష్ణ కూడా ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై రాకేష్ మాట్లాడుతూ నాన్న పనిచేస్తున్న పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా నియామకం కావడం అరుదైన అవకాశంగా భావిస్తున్నానన్నారు. ఇద్దరం కలిసి పాఠశాలకు వెళ్తామన్నారు.

గొల్లపల్లి హైస్కూలులో విధుల్లో చేరి తొలి సంతకం చేస్తున్న ఉపాధ్యాయుడు రాకేష్

జేఎన్‌టీయూ వీసీగా వెంకటసుబ్బారావు బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ (గురజాడ విశ్వవిద్యాలయం) ఉపకులపతిగా ప్రొఫెసర్ వి.వెంకట సుబ్బారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జేఎన్‌టీయూలో మెకానికల్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న ఆయనను ఇక్కడకు గవర్నర్ బదిలీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యలనగరంలో ఉపకులపతిగా రావడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. విశ్వవిద్యాలయంలో పారదర్శకతను నెలకొల్పడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన సుబ్బారావుకు రిజిస్ట్రార్ జయసుమతో పాటు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



వీసీగా బాధ్యతలు చేపడుతున్న ప్రొఫెసర్ వెంకటసుబ్బారావు

516బికి 'మార్గం' సుగమం

● పెందుర్తి - బొడ్డవర జాతీయ రహదారి పనులు జనవరిలో ప్రారంభం

● నిర్వాసితుల అకౌంట్‌లో డిసెంబర్ 31లోగా నిధులు జమ

కొత్తవలస, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి శృంగవరపుకోట మండలం బొడ్డవర(బౌడర)వరకు కొత్తగా చేపట్టనున్న 516బి జాతీయ రహదారి పనులు 2026 జనవరి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జోరందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.952 కోట్ల 56 లక్షల నిధులు కూడా విడుదల చేసింది. ఇప్పటికే సర్వే పనులు పూర్తి కావడంతో రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి మరోపక్క మార్కింగ్ పనులు మొదలు పెట్టారు.

● విశాఖపట్టణం జిల్లా పెందుర్తిలోని 16వ జాతీయ రహదారి నుంచి ఈరోడ్డు ప్రారంభమై కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపుకోట మండలాల మీదుగా బొడ్డవర వద్ద 516 జాతీయ రహదారిని కలుపుతుంది. కాగా ప్రభుత్వం కేటాయించిన 952 కోట్ల 56 లక్షల రూపాయల నిధుల్లో రూ. 199 కోట్ల 65 లక్షలను నిర్వాసిత కుటుంబాలకు వెచ్చించనున్నారు. మిగిలిన రూ.782కోట్ల 91 లక్షలను రోడ్డు విస్తరణ పనులకు కేటాయించారు. రైల్వే క్రాసింగ్ ఉన్న ప్రాంతాలలో బైపాస్ రోడ్లను నిర్మించనున్నారు. ఈ పనులన్నీ 2026 జనవరి నుంచి ప్రారంభించి రెండు సంవత్సరాల వ్యవధిలో పూర్తి చేయాలన్నది ప్రణాళిక. నిర్వాసితులకు డిసెంబర్ 31లోగా నష్ట పరిహారం జమ చేయనున్నారు.

బోగస్ పించన్లపై విచారణ

● ఉణుకూరును సందర్శించిన ఎంపీడీవో, ఎంఈవో

7లో

కుమార్తె పెళ్లి చూడకుండానే..

● ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

7లో









ఆ నిబంధన అమలేదీ?

● పంచాయతీలకు బకాయిలు చెల్లించని రిజిస్ట్రేషన్ శాఖ ● నిధులు విదల్చని వీఎంఆర్‌డీఏ

● అభివృద్ధి పనుల్లో పల్లెలు వెనకబాటు ● పారిశుధ్య కార్మికుల వేతన చెల్లింపులకూ ఇబ్బందులు

● శృంగవరపుకోట మేజర్ పంచాయతీకి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి గత ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు రూ.36 లక్షల సర్‌చార్జీ రావాల్సి ఉంది. అప్పటికి ఏడాదిన్నర కాలంగా ఈ పంచాయతీకి బకాయిలు చెల్లించలేదు. ఈ ఏడాది ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచిపోయాయి. వీటిని కలుపుకుంటే రూ.50లక్షలకు పైబడి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి చెల్లింపులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

● శృంగవరపుకోట పంచాయతీలోని ఇళ్ల నిర్మాణదారులు ఇంతవరకు(2021 నుంచి) వీఎంఆర్‌డీఏకు రూ.22.02 లక్షలు చెల్లించారు. ఈ పంచాయతీ వీఎంఆర్‌డీఏ పరిధిలో చేరిన నాటి నుంచి ఇంటి నిర్మాణం కోసం పంచాయతీకి చెల్లిస్తున్న పన్నుతో పాటు వీఎంఆర్‌డీఏకు నిబంధనల ప్రకారం రుసుం కడుతున్నారు. ఈ సంస్థ ఖాతాకు చెక్కులు తీసి పంపిస్తున్నారు. ఇక్కడ నుంచి ఆదాయాన్ని పొందుతున్న వీఎంఆర్‌డీఏ నిబంధనల ప్రకారం పంచాయతీ అభివృద్ధికి పైసా విదల్చడం లేదు.

శృంగవరపుకోట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీలో 9 మంది శాశ్వత పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరికి తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వలేదు. 36 మంది పారిశుధ్య కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. వీరికి ఐదు నెలల బకాయిలుండగా దసరాకు ముందు మూడు నెలల జీతాలు చెల్లించారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన వాటాలు, వీఎంఆర్‌డీఏ నిధులు విదల్చకపోవడంతో జిల్లాలోని పంచాయతీలపై పడుతున్న ఆర్థిక భారానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. పంచాయతీలకు ఇతర మార్గాల్లో అందాల్సిన సహకారం ఎంతోకొంత అందితేనే కనీసం పారిశుధ్య కార్మికులకైనా జీతాలు ఇవ్వగలవు. పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులే ఆధారం. ఈ నిధులు అందించడంలోనూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి న్యాయంగా అందాల్సిన నిధులను ఇవ్వకపోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన వాటిని పక్కదారి పట్టించింది. దీంతో పంచాయతీలు తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు వంటి రోజువారీ కార్యకలాపాలు చేసేందుకు కూడా నానా తంటాలు పడుతున్నాయి. పల్లెల్లో రోడ్ల నదుపాయాలైతే పూర్తిగా విస్మరించారు. ఇటు అభివృద్ధి కుంటుపడింది. దీనికి తోడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులూ అందడం లేదు.

రూ.34 కోట్లు బకాయి

జిల్లాలోని పంచాయతీలకు దాదాపు రూ.34 కోట్ల వరకు రావాల్సి ఉందని అంచనా. భూములు(మిగతా 8వ పేజీలో..)

అవగాహన కల్పిస్తున్నారా?

● మాదక ద్రవ్యాల నిర్మూలనపై శిబిరాలు ఏవీ?

● నషా ముక్త్ అభియాన్ ద్వారా నిధులు మంజూరు చేసిన కేంద్రం

● జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖకు బాధ్యతలు అప్పగింత

● అవగాహన తేవడం లేదని పీజీఆర్ఎస్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం తయారు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో అమలును పర్యవేక్షించడం లేదు. నిధులు మంజూరు చేసి ఆచరణపై నిఘా పెట్టలేదు. డ్రగ్స్ నివారణపై అవగాహన శిబిరాల నిర్వహణ బాధ్యతను జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల శాఖకు అప్పగించాయి. నషా ముక్త్ అభియాన్ ద్వారా నిధులు మంజూరు చేశాయి. అయితే శిబిరాల నిర్వహణపై పర్యవేక్షణ లేదు. దీనిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. అవగాహన సదస్సులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు విమర్శలున్నాయి.

కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ అభియాన్ ద్వారా డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కోసం కొన్నినెలలు క్రితం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖకు రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో కళాశాలలు, విద్యా సంస్థల్లో సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలి. అలాగే ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించాలి. కానీ ఆ శాఖ అధికారులు పెద్దగా అవగాహన (మిగతా 8వ పేజీలో..)



విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం

ప్రభుత్వ ఆధ్వర్యంలో అప్పారావు జయంతి: మంత్రి

6లో



గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, తదితరులు

'మిగ్-21'తో 20 ఏళ్ల అనుబంధం

● వైమానిక దళ మాజీ సభ్యుడు వెంకటరావు

6లో

ట్రయల్ రన్ విజయవంతం

● నేడు పైడిమాంబ తెప్పోత్సవం

విజయనగరం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ తెప్పోత్సవానికి సంబంధించి ట్రయల్ రన్ సోమవారం విజయవంతం అయ్యింది. దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. అంతకముందు 4 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు చేపడ్తారు.



పెద్ద చెరువులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



శుద్ధ అబద్ధం!

● జిల్లాలో పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు ● అనుమతులు లేనివే అధికం

● నిబంధనలు పట్టని వైనం ● ప్రజారోగ్యంపై పెనుప్రభావం

అన్నిరకాల రుగ్మతలకు తాగునీరే ప్రధాన కారణమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తాగేనీరు మంచిదైతే వ్యాధులు దరిచేరవని చెబుతున్నారు. ఈ కారణంతోనే జిల్లాలో చాలా మంది శుద్ధ జలాలపై అత్యధికంగా ఖర్చు చేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని ఆర్వో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే శుద్ధి చేసిన నీటిని అందిస్తే మంచిదే కానీ నిర్వాహకులు కేవలం లాభాపేక్షతో దోపిడీకి దిగుతున్నారు. కనీస నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించడం లేదు. ఈ విషయం తెలియక నీళ్లు తీసుకెళ్తున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.



ఆర్వో ప్లాంట్ లోపల పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి(ఫైల్)

విజయనగరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణం, పల్లె తేడా లేకుండా వందలాదిగా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 80 భారీ ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో అనుమతులు ఉన్నవి కేవలం 17 మాత్రమే. మిగతావి అనధికారికంగా నడుపుతున్నట్టు తెలుస్తోంది. మొన్న ఆ మధ్యన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 31 ప్లాంట్లను స్వయంగా తనిఖీ చేయగా కేవలం నాలుగింటికే అనుమతులు ఉన్నట్టు తేల్చడం ఆందోళన కలిగించింది. కొన్నిచోట్ల ఇతర శాఖల నుంచి అనుమతులు తీసుకున్నా.. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి పొందలేదు. కొందరు ట్రస్టుల పేరుతో ప్లాంట్లను నడుపుతున్నారు. ఇటువంటి వారు ఇళ్లకు క్యాన్లతో నీటిని సరఫరా చేయకూడదు. ప్లాంటు వద్దకు వస్తే నామమాత్రపు ధరకు అందించాల్సి ఉంటుంది కానీ ఇళ్ల వద్దకు వెళ్లి అధిక ధరకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

12 రకాల శుద్ధి జరుగుతోందా?

స్వచ్ఛమైన నీటికి రంగు, రుచి, వాసన ఉండవంటారు. వీటిలో ఏ ఒక్కటి ఉన్నా (మిగతా 8వ పేజీలో..)

కొత్త గురువులు వచ్చారోచ్

● విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు సోమవారం ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అవకాశం రావడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగం రావడానికి కారణమైన ప్రభుత్వానికి ఓ వైపు కృతజ్ఞతలు చెబుతూనే... మరోవైపు అంకితభావంతో విధులు నిర్వహిస్తామని... ఇది ఎంతో సంతోషకరకమైన సమయమని ఆనందం వ్యక్తం చేశారు.

చాలా ఆనందంగా ఉంది..



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న నారాయణపురం వేణు

సాలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నా పేరు నారాయణపురం వేణు. మాది కురుపాం గ్రామం. డీఎస్సీలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 37వ ర్యాంకు వచ్చింది. నా మొట్టమొదటి పోస్టింగ్ సాలూరు పట్టణంలో కేహెచ్ స్కూల్‌లో సోమవారం మొదటి రోజు విధుల్లోకి చేరాను. చాలా ఆనందంగా ఉంది. ఇప్పటివరకు ప్రైవేట్ స్కూల్‌లో పనిచేశాను. మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

ఎంతో సంతోషంగా ఉంది..



మాది శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి. డీఎస్సీ తెలుగు విభాగంలో నాకు 15వ ర్యాంకు వచ్చింది. మొట్టమొదటిసారిగా సాలూరులో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధుల్లో చేరాను. పిల్లలకు పాఠాలు బోధిస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు నేను పడిన కష్టాన్ని పూర్తి స్థాయిలో మరిచిపోయి...ఆనందాన్ని పొందుతున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం... అందులో నాకు 15వ ర్యాంకు రావడం... ఇలా విధుల్లో చేరడం చాలా ఆనందంగా ఉంది.

-హెచ్.అరుణజ్యోతి, తెలుగు ఉపాధ్యాయురాలు

భావోద్వేగానికి గురయ్యా..



రాజాం రూరల్/రాజాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాది మధ్య తరగతి కుటుంబం. 2018లో తొలిసారిగా డీఎస్సీ రాశాను. కానీ ఉద్యోగం పొందలేకపోయాను. అప్పటి నుంచి తదేక దీక్షతో ప్రిపేర్ అయ్యాను. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం నాకెంతో సంతోషంగా ఉంది. పాఠశాలలో అడుగుపెట్టే సమయంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాను. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకంగా విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటాను.

-పి.ధర్మారావు, వాంగ్రంగి, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా

ఊహించలేదు..



డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడం, పరీక్షల నిర్వహణ, నియామకాలు.. ఇంత త్వరగా జరుగుతాయని నేను ఊహించలేదు. హ్యాట్సాఫ్ టూ లోకేష్. గత ప్రభుత్వ హయాంలో అయిదేళ్లు డీఎస్సీ ఊసే లేకపోవడంతో చాలా భయపడ్డాను. నాలుగో ప్రయత్నంలో మేథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికై రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరడం ఎంతో ఆనందంగా ఉంది. నా జీవితంలో మరచిపోలేని రోజు ఇది. ఈ రోజు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశాను.

-వరహాలరాజు, శ్రీకాకుళం

అమ్మ కష్టం ఫలించింది..



పదో తరగతి చదువుతున్నపుడే నాన్న చనిపోయారు. కూలి పనులు చేసి అమ్మ చదివించింది. అమ్మ కష్టాన్ని గుర్తించి ఎలాగైనా ప్రభుత్వోద్యోగం సాధించాలని బి.ఇడి . పూర్తి చేశాను. గతంలో రెండుసార్లు పరీక్ష రాసినా అవకాశం రాలేదు. ఇటీవల మెగా డీఎస్సీకి దరఖాస్తు చేశాను. అప్పుడే అమ్మకు చెప్పాను.. ఈసారి ఎలాగైనా పోస్ట్ కొడతానని. జిల్లాలో రెండో ర్యాంకు సాధించాను. బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విధుల్లో చేరడం చాలా సంతోషంగా ఉంది. అమ్మ పడిన కష్టానికి ఫలితం దక్కింది.

-మహేష్, రాగోలు, శ్రీకాకుళం జిల్లా

ప్రశంసనీయం...



మాది విజయనగరం. గజపతినగరంలో స్థిరపడ్డాం. మధ్య తరగతి కుటుంబం. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి.. అయిదో ప్రయత్నంలో స్కూల్ అసిస్టెంట్ గా (మేథ్స్) ఎంపికయ్యాను. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విధుల్లో చేరాను. చాలా సంతోషంగా ఉంది. గత అయిదేళ్లు డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాను. కూటమి ప్రభుత్వం 2025లో నోటి ఫికేషన్ ఇచ్చి సకాలంలో నియామక ప్రక్రియ పూర్తి చేయడం ప్రశంసనీయం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరడంతో నా భార్య, ఇద్దరు పిల్లలు చాలా సంతోషిస్తున్నారు.

-మల్లేశ్వరరావు, గజపతినగరం

ఆ క్షణాలు ప్రత్యేకం..



ఉపాధ్యాయినిగా విధుల్లో చేరిన తొలి క్షణాలు ఎంతో ఆనందాన్నిచ్చాయి. వాస్తవానికి నాది శ్రీకాకుళం. అత్తవారిల్లు రాజాం. మావారు వీఆర్వోగా పని చేస్తున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాను. డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో స్కూల్ అసిస్టెంట్ (మేథ్స్)గా బాధ్యతలు చేపట్టాను. ఉపాధ్యాయ వృత్తిలో చేరడం చాలా సంతోషంగా ఉంది

-ఆశపు లక్ష్మీప్రసన్న, శ్రీకాకుళం

జియ్యమ్మవలసలో..



ఆర్ఆర్‌బీపురంలో హెచ్ఎం తిరుపతికి ఉత్తర్వులు అందిస్తున్న కొత్త ఉపాధ్యాయినులు

జియ్యమ్మవలస, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్త గురువులు సోమవారం విధుల్లో చేరారు. బీజేపురం, పిప్పలభద్ర, చినకుదమ, చినమేరంగి, జియ్యమ్మవలస, పెదమేరంగి, పెదబుడ్డిడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐదుగురు ఎస్‌జీటీలు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్ (సోషల్), ఒక స్కూల్ అసిస్టెంట్ (ఎన్ఎస్), ఒక స్కూల్ అసిస్టెంట్ (పీఎస్), నలుగురు ఫిజికల్ డైరెక్టర్లు, ఇద్దరు తెలుగు, ఒకరు ఇంగ్లీషు కలిపి మొత్తం 21 మంది విధుల్లో చేరారు. టీకే జమ్ము, ఆర్ఆర్‌బీ పురం, వనజ, జియ్యమ్మవలస గ్రామాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు నాలుగు, పీటీ మండ గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల ఒకటి ఉన్నాయి. వీటిలో ఎస్‌టీజీలు 16 మంది, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు (ఎన్ఎస్), ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు (పీఎస్)తో కలిపి మొత్తం 20 మంది విధుల్లో చేరారు.

ఉద్వేగభరితంగా ఉంది..



2019లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తయింది. మెగా డీఎస్సీలో తొలి ప్రయత్నంలోనే ఎస్జీటీ కొలువు సాధించాను. పాచిపెంట మండలం గిరిశిఖర గ్రామం మోదుగ ఎంపీపీ స్కూల్‌లో ఈ రోజు విధుల్లో చేరాను. ఇది ఉద్వేగభరితంగా ఉంది. కొలువు రావడానికి సకాలంలో మెగా డీఎస్సీ నిర్వహించిన సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్‌లకు ధన్యవాదాలు.

-అంజలి గణేష్, మెంటాడ, విజయనగరం జిల్లా

పాలకొండలో..



హెచ్ఎం కోటిబాబుతో నూతన ఉపాధ్యాయులు

పాలకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలంలోని బడ్డుమాసంగి ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులతో మమేకం కావడం జీవితంలో మరపురాని తీపి గుర్తు అని వారంతా చెప్పారు. ప్రభుత్వం విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు నైపుణ్యాలను అందించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను అందుబాటులో ఉంచిందని... వాటిని అవగతం చేసుకొని విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం పి.కోటిబాబు నూతన ఉపాధ్యాయులు ఎస్.గణపతినాయుడు (గణితం), పి.గణేష్ (పొలిటికల్‌సైన్స్), టి.గాయత్రి (ఫిజికల్ సైన్స్), ఎ.సంతోషికుమారి (ఎస్‌జిటి)లను అభినందించారు.

చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయురాలిగా..



రికార్డుల్లో సంతకం చేస్తున్న సౌందర్య

గరుగుబిల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాను విద్యాభ్యాసం చేసిన పాఠశాలలోనే ఉపాధ్యాయినిగా నియమితులయ్యారు శిరికి సౌందర్య. సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట గ్రామానికి చెందిన సౌందర్య సోమవారం నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 10వ తరగతి వరకు విద్యనభ్యసించానని తెలిపారు. తన భర్త మంత్రిబుడ్డి సింహాచలంనాయుడు గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో మొత్తం 8 మంది విధుల్లో చేరారు. తోటపల్లి పాఠశాలలో ఇంగ్లీషు, నాగూరు పాఠశాలలో సోషల్, ఫిజికల్ డైరెక్టర్, రావివలస పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్, గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్జీటీగా ఒకరు బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాల పునఃప్రారంభంపై కమిటీ

● సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక

కురుపాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాండిస్‌తో అతలాకుతలమవుతున్న కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాలను పునః ప్రారంభించడానికి సాధ్యాసాధ్యాలను అధికారుల బృందం పరిశీలించింది. జాండిస్‌తో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, వందలాది మంది అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. దసరా సెలవుల అనంతరం కురుపాం బాలికల గురుకుల పాఠశాల పునః ప్రారంభం కాలేదు ఈ నెల 14న పునః ప్రారంభించాలని కలెక్టర్ గతంలో ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పాఠశాలలో పరిస్థితులు చక్కబడ్డాయా లేదా? పునః ప్రాంభానికి అనుకూలంగా ఉందా?లేదా? అని తేల్చడానికి ఐటీడీఏ డీడీ నేతృత్వంలో 8 మంది అధికారులతో కమిటీని నియమించారు. సోమవారం రాత్రి పార్వతీపురం ఐటీడీఏ డీడీ విజయశాంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మణికుమార్, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ కె. నాగేశ్వరరావు, కౌశిక్, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు క్షుణ్ణంగా పరిశీలించారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందించినట్టు చెప్పారు.



పాఠశాల విషయమై చర్చిస్తున్న అధికారులు

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. భూ తగాదాలకు సంబంధించినవి-8, కుటుంబ కలహాలకు సంబంధించి-5, మోసాలకు పాల్పడినవి-4, నగదు వ్యవహారానికి సంబంధించి-1, ఇతర అంశాలకు సంబంధించినవి-22 మొత్తంగా 40 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో సంబంధిత పోలీసు అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఘనంగా నందన్న ఉత్సవాలు

గరివిడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాత గరివిడిలో నందన్న, గౌరమ్మ ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కాపు వీధి, యాదవ వీధి తదితర వీధుల్లో నందన్న, గౌరమ్మ ప్రతిమలను ఊరేగించారు. ఈసందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సాలూరు రూరల్: గౌరీ మహోత్సవాల్లో భాగంగా వడ్డీవీధిలో మజ్జి వారి నందన్న వేదిక వద్ద సోమవారం శివపూజను ఘనంగా నిర్వహించారు. ఏటా మజ్జి సూర్యనారాయణ వారసులు నందన్న ఉత్సవాలను నిర్వహిస్తారు. గౌరీ పౌర్ణమికి ప్రారంభించిన ఉత్సవాలను నాగుల చవితినాడు అనుపోత్సవం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ.



గరివిడి: నందన్న ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆధ్వర్యంలో అప్పారావు జయంతి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తాటిపూడి రిజర్వా యర్ నిర్మాణ సాధకుడు, ఉత్తరాంధ్ర వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తాటిపూడి రిజర్వాయర్ వద్ద గొర్రిపాటి బుచ్చిఅప్పారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించి, ఈ ప్రాంత ప్రజల కలను సాకారం చేసిన మహనీయుడు అప్పారావని తెలిపారు. ఈ రిజర్వాయర్ వల్ల ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందుతోందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆయన తనదైన పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాటిపూడి ప్రాజెక్టుకు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరు పెట్టిందని వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మన ప్రాంత నాయకులు స్వాతంత్ర్య సేనలో పని చేశారని.. అటువంటి వ్యక్తులను గుర్తుంచుకోవలసిన అవసరం ఉందన్నారు. వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు హయాంలో అనేక ప్రాజెక్టులకు రూపకల్పన జరిగిందని తెలిపారు. గొర్రిపాటి బుచ్చి అప్పారావు కుటుంబీకులు రాజకీయాల్లో లేకపోయినా ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జీబీ అప్పారావు కుటుంబీకులను సన్మానించారు. అక్కడికి వచ్చిన రైతులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీ గణేష్ కుమార్, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జనసేన నాయకులు ఎం.సురేష్, బీజేపీ నాయకురాలు రెడ్డి పావని, తాటిపూడి ఆయకట్టు సంఘం అధ్యక్షులు కె.జగన్నాధం, బుచ్చిఅప్పారావు కుటుంబ సభ్యులు రమణమ్మ, బాలగంగాధర్ తిలక్, రమాదేవి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



యుద్ధ విమానం వద్ద కుటుంబ సభ్యులతో వెంకటరావు

‘మిగ్-21’తో 20 ఏళ్ల అనుబంధం

● వైమానిక దళ మాజీ సభ్యుడు వెంకటరావు

పూసపాటిరేగ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మిగ్ 21 యుద్ధ విమానం.. 1960వ సంవత్సరం నుంచి దేశానికి ఎన్నో సేవలు అందించింది. నేడు స్టెల్త్ టెక్నాలజీ, 5వ జనరేషన్ యుద్ధ విమానాలతో యుద్ధాలు జరుగుతుండడంతో ప్రభుత్వం వీటి సేవలకు స్వస్తి చెప్పింది. ఈ రకం యుద్ధ విమానాలతో తనకు ఉన్న అనుబంధాన్ని వైమానిక దళ మాజీ సభ్యుడు వెంకటరావు ‘ఆంధ్రజ్యోతి’తో పంచుకున్నారు. లంకలపల్లి పాలెం గ్రామానికి చెందిన లంకలపల్లి వెంకటరావు ఈ యుద్ధ విమానాలకు సంబంధించి సమాచార వ్యవస్థలో 15 ఏళ్లకు పైబడి పని చేశానని తెలిపారు. ఇవి ఒకటిన్నర నిమిషాలలో గాలిలోకి ఏగిరే సత్తా ఉన్నవని తెలిపారు. వీటిని సరిహద్దుల వెంబడి ఎప్పుడూ మనదేశం మోహరించి ఉంచేదని చెప్పారు. అమెరికాకు చెందిన నేటి తరం యుద్ధ విమానాన్ని అభినందన్ మిగ్ 21తో పేల్చివేయడం గమనార్హమని తెలిపారు. దీనికి కావలసిన సమాచార వ్యవస్థలో చాలా సంవత్సరాలు పని చేయడం ఆనందకరమని అన్నారు. రాజస్థాన్‌లో బికనీర్, నల్ ఎయిర్‌బేస్‌లలో దీనితో పని చేశానని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ, అసోంలోని తేజ్‌పూర్ తదితర ప్రాంతాలకు చెందిన ఎయిర్‌బేస్‌లలో వీటితో తాను పని చేసినట్లు తెలిపారు. అభినందన్ తండ్రి అయిన వర్థమాన్ అభినందన్‌తో కూడా తాను మిగ్‌తో పని చేసినట్లు తెలిపారు. నేటి తరం యుద్ధాలు టెక్నాలజీపై ఆధారపడడం.. ఇవి పాతతరం యుద్ధ విమానాలు కావడంతో ప్రభుత్వం వీటికి స్వస్తి చెప్పిందన్నారు. ఈ యుద్ధ విమానాలతో తనకు విడదీయరాని బంధం ఉందని తెలిపారు. తాను ఎయిర్‌ఫోర్స్‌లో 1982 నుంచి 2021 వరకూ సేవలు అందించానని వెంకటరావు చెప్పారు.



విధి నిర్వహణలో..

పీజీఆర్ఎస్‌కు హాజరు కావలసిందే..

● మండల, మున్సిపల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జరిగే పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు మండల, మున్సిపల్ స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లేదా జూమ్ లింక్ ద్వారా తప్పనిసరిగా హాజరు కావలసిందేనని కలెక్టర్ రామసుందర్ రెడ్డి చెప్పారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ‘మీకోసం’ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మరింత సమర్థత, పారదర్శకత చూపాలని సూచించారు. రెండు వారాలలో ఫిర్యాదుల రీఓపెనింగ్ శాతం గణనీయంగా తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సక్రమంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వడం, అందులో సంబంధిత రూల్ పొజిషన్ స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరి అని చెప్పారు. ఎండార్స్‌మెంట్ నిర్లక్ష్యంగా ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు కనీసం 60 కాల్స్ చేసి.. ఫిర్యాదుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు.

184 వినతులు..

కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 184 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 69, డీఆర్‌డీఏ 28, డీపీవోకు సంబంధించి 13, మున్సిపాల్టీలవి 13, జీఎస్‌డబ్ల్యూఎస్ 21, మిగిలినవి ఇతర శాఖలవి ఉన్నాయి. డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ప్రత్యేక ఉపకలెక్టర్లు మురళి, వెంకటేశ్వరరావు, నూక రాజు, ప్రమీల గాంధీ, రాజేశ్వరి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులను శత్రువుల్లా చూడకూడదు..

తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి వస్తున్న అర్జీదారులను శత్రువుల్లా చూడకూడదని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. మానవతా దృక్పథంతో అర్జీలను పరిష్కరించాలన్నారు. సోమవారం సాయంత్రం పీజీఆర్ఎస్ వినతులపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ ఓపెన్ అయిన కేసులు 2.83 శాతం ఉన్నాయన్నారు. అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పునర్ నియామకం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర పంచాయతీ దారపర్తికి చెందిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను 2022-23లో నిర్దేశించిన పని దినాలు సాధించలేదని తొలగించారు. అయితే ఇక్కడ ఫీల్డ్‌అసిస్టెంట్లు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు, సీపీఎం, జనసేన నాయకులు పలుమార్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయం ఎమ్మెల్యే.. ఉపముఖ్యమంత్రికి చెప్పడంతో తొలగించిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి నియమిస్తూ జిల్లా ఉపాధి హామీ శాఖ పీడీ ఉత్తర్వులు ఇచ్చారు.

రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

రాజాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో కొత్తగా రేషన్ డిపో ఏర్పాటు చేయాలని టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పిల్లా సత్యంనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం ఆ కాలనీవాసులతో కలిసి స్థానిక తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ డిపో లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బంగార్రాజుకు అభినందన

భోగాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ ఏఎంసీ డైరెక్టర్ జి.వెంకటరమణ సోమవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజును పోలిపల్లి గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఏఎంసీ డైరెక్టర్ పదవి దక్కినందుకు కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

బెలగాం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన విద్యార్థుల ప్రాణాల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజా సంఘాల, గిరిజన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలను నిరోధించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు పాలక రంజిత్‌కుమార్, రవికుమార్, పి.సంగం, ఆర్వీఎస్ కుమార్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో చీపురుపల్లి విద్యార్థిని ప్రతిభ

చీపురుపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమెన్స్ కబడ్డీలో సౌత్ జోన్ నేషనల్ యూనివర్సిటీ గేమ్స్‌కు చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డి.లావణ్య అనే విద్యార్థిని ఎంపికయ్యింది. ఈనెల 11, 12 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో చీపురుపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచింది. చీపురుపల్లి జట్టుకు తృతీయ స్థానం లభించగా, జట్టులో ఆడిన డి.లావణ్య మరింతగా రాణించి, సౌత్ జోన్ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈసందర్భంగా లావణ్యను ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, కె.జ్వాలాముఖి అభినందించారు.

ఆ క్షణం.. జీవితాంతం గుర్తుంచుకుంటా



మంత్రి లోకేశ్‌తో సంతోష్

జామి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తన అభిమాన నాయకుడు తనను దగ్గరకు పిలిపించి మరీ తనతో ఫొటో దిగడం చాలా ఆనందంగా ఉందని మండలంలోని వన్నె గ్రామానికి చెందిన సీహెచ్ సంతోష్ అన్నారు. రెండు రోజుల కిందట మంత్రి లోకేశ్‌బాబు విశాఖ వచ్చారని తెలుసుకున్న సంతోష్ అక్కడకు వెళ్లారు. లోకేశ్ అక్కడ ఉన్న నాయకులతో ఫొటోలు దిగుతున్న సమయంలో సంతోష్ కూడా ఫొటో తీయించుకుందామని చూడగా, కుదరలేదు. దీంతో లోకేశ్ దూరం నుంచి గమనించి.. సంతోష్‌ను తన వద్దకు రప్పించుకుని ఫొటో దిగారు. ఆ క్షణం తన జీవితాంతం గుర్తుంచుకుంటానని సంతోషం సోమవారం విలేకర్ల ఎదుట ఆనందం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

రాజాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.రాజశేఖర్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, డీటీలు, ఆర్ఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ శివకుమార్ పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి పోటీలు

రాజాం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్టు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలయ్య ప్రకటించారు. ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబరు 1న మండల స్థాయి, నవంబరు 23న జిల్లా స్థాయి, డిసెంబరు 12 నుంచి 14 వరకు రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు.

గూగుల్ రాకతో ఉపాధి అవకాశాలు

● విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గూగుల్ కంపెనీ విశాఖపట్టణం రావడంతో ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల కృషి వల్ల గూగుల్ కంపెనీ విశాఖకు తరలి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఉద్యోగ, ఉపాధి కల్పన హామీకి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు.

నవ్యాంధ్రకు శుభ పరిణామం

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్ర ప్రదేశ్‌కు శుభ పరిణామమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను తీసుకువచ్చి హైదరాబాద్‌ను ఏ విధంగా అభివృద్ధి చేశారో నేడు విశాఖకు గూగుల్‌ను తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చనున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే అధికంగా పెట్టుబడులు వచ్చాయన్నారు.

మారనున్న ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం

● మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం శుభ పరిణామం అని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు తీసుకొచ్చి హైదరాబాద్‌ను ఏవిధంగా అభివృద్ధి చేశారో నేడు విశాఖకు గూగుల్ టెక్ సంస్థను తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చనున్నారన్నారు. 16 నెలల్లో రాష్ట్రానికి రూ.11.20లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు



మాట్లాడుతున్న బంగార్రాజు

పిడుగు తోటారావు, నీలాపు అప్పలరామి రెడ్డి, పిడుగు వెంకటసత్యం పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు.. పేదలకు సూపర్ గిఫ్ట్



ఎస్.కోట రూరల్: బైకు ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు.. పేద, మధ్య తరగతి ప్రజలకు సూపర్ గిఫ్ట్ అని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా బైక్ ర్యాలీ ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి మురళి, జీఎస్టీ అధికారి రాము, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● గజపతినగరం: జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పురిటిపెంట జంక్షన్ వరకు సచివాలయ సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో బి.కల్యాణి, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● విజయనగరం టౌన్: అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగించే విధంగా జీఎస్టీ శ్లాబులను ప్రభుత్వం సవరించినందని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు జర గాలనే ఉద్దేశంతో మహారాజా సంగీత కళాశాలలో రెండు రోజుల పాటు ప్రదర్శనతో పాటు విక్రయాలు చేపట్టారని చెప్పారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి.నిర్మలాజ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



గజపతినగరం: సచివాలయ ఉద్యోగుల బైక్ ర్యాలీ



విజయనగరం టౌన్: స్టాల్స్ పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

మెయిన్ వర్కర్లుగా పదోన్నతి కల్పించాలి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగి ఆన్‌లైన్‌లో తప్పులు వల్ల తప్పిపోయిన మినీ వర్కర్లకు తక్షణమే ప్రమోషన్ జాబితాలో చేర్పించి మెయిన్ వర్కర్లుగా పదోన్నతి కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 284 మంది మినీ వర్కర్లు 15 సంవత్సరాలుగా పని చేస్తున్నారని, తాము విధుల్లో చేరిన సమయంలో పదో తరగతి ధ్రువపత్రాలు సమర్పించినా అధికారులు ఆన్‌లైన్‌లో తప్పుగా పొందిపరిచారని చెప్పారు. ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల వార్షిక సమావేశం

విజయనగరం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వీటీ అగ్రహారం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల వార్షిక సమావేశానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. అనంతరం ఆద్విక్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధుల కింద మంజూరు చేసిన రూ.7లక్షల విలువైన సోలార్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. అలాగే ఐటీఐ పూర్తిచేసిన వారికి గ్రాడ్యువేషన్ పత్రాలు అందించారు.

సొంత నిధులతో వాటర్‌ప్లాంట్

వేపాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. చినగుడిపాల గ్రామంలో ఎస్‌బీ జనాదేవ్ అనే వ్యక్తి రూ.5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె జనాదేవ్‌ను అభినందించారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, మండల మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేచలపు జగ్గుబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సుంకరి అప్పారావు, సర్పంచ్ భోజంకి రామునాయుడు పాల్గొన్నారు.

పాలిథిన్ వినియోగం తగ్గాలి

రాజాం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్ వినియోగం తగ్గాలని, వాటి స్థానంలో గుడ్డసంచుల వినియోగం పెరగాలని రాజాం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వికాస తరంగిణి సమకూర్చిన 350 గుడ్డసంచులను మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేట సచివాలయంలో సోమవారం ఆయన పంపిణీ చేశారు. పాలిథిన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పట్టణంలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కోటగిరి నారాయణరావు, టీటీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

లొట్లపల్లి సంతకు లైసెన్స్ ఇచ్చిన వారిని సస్పెండ్ చేయండి

జామి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దఎత్తున పశువుల అక్రమ రవాణా జరిగే లొట్లపల్లి సంతకు లైసెన్స్ మంజూరు చేసిన అధికారులు, సిబ్బందిని వెంటనే కలెక్టర్ సస్పెండ్ చేసి, సంతను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య జిల్లా కార్యదర్శి బీమపల్లి సంధ్యారాణి కోరారు. సోమవారం జామిలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈవోపీఆర్డీ ఉమ, కార్యదర్శి శివకుమారీలు సంత నిర్వాహకులతో కుమ్మక్కయి అక్రమంగా లైసెన్స్ ఇచ్చారన్నారు. ఈ సంత నుంచి పక్క రాష్ట్రాలకు, కబేళాలకు అక్రమంగా పశువులు వెళ్తున్నాయని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, వెంటనే ఆయన స్పందించి.. డీపీవో మల్లికార్జునరావుకు ఆదేశించారని, దీంతో డీపీవో ఈ అక్రమ లైసెన్స్ మంజూరుపై డీఎల్‌పీవో ఆర్.శిరీషను విచారణకు ఆదేశించారని సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కేవీఆర్ సత్యనారాయణ, చింతల రేణుక, అప్పలరాజు, పైడితల్లి పాల్గొన్నారు. ● దీనిపై ఈవోపీఆర్డీ ఉమ, కార్యదర్శి శివకుమారిని వివరణ కోరగా.. నిబంధనల ప్రకారం లైసెన్స్ ఇచ్చామని తెలిపారు.

ఆకలి కేకలు వినిపించవా?



రిలే దీక్షలో పాల్గొన్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గత 115 రోజులుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. బొడ్డవర గ్రామంలో గత కొన్ని రోజులుగా వీరు రిలే దీక్ష చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన రిలే దీక్షలో వీరు పాల్గొని, మాట్లాడారు. తమ ఆకలి కేకలు ఈ ప్రభుత్వానికి వినిపించలేదని వాపోయారు.

ధర్నాలకు అనుమతి తప్పనిసరి

విజయనగరం క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్-30 పోలీసు చట్టాన్ని అక్టోబరు 13 నుంచి నవంబరు 11 వరకూ అమలు చేస్తున్నట్టు ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల పోలీసు శాఖ అనుమతులు లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. నిరసన కార్యక్రమాలు చేపట్టడం చట్ట విరుద్ధమని చెప్పారు. ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసనలు తెలిపేందుకు ముందుగా డీఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో హెచ్చరించారు.

షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించండి

పార్వతీపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి గిరిజన గ్రామాన్ని షెడ్యూల్డ్ ప్రాంతంగా గుర్తించాలని ఏజేసీ చైర్మన్ కె.ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ ప్రభాకరరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామాలను అప్పటి మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాలుగా ప్రకటించిందన్నారు. కానీ ఐడీపీఏల పరిధిలోని కొన్ని గ్రామాలనే షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించారన్నారు. దీంతో మిగిలిన గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏజేసీ గౌరవ చైర్మన్ నీలకంఠం, డి.సీతారాం, నిమ్మక అన్నారా, కె.గౌరమ్మ, ఎ.చంద్రశేఖరరావు, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ నిర్మించాలి



రైల్వే అధికారి వినతిపత్రం అందజేస్తున్న కొత్తవలస గ్రామస్థులు

బెలగాం/ పార్వతీపురం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలోని టౌన్ రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ మార్గం నిర్మించాలని కొత్తవలసకు చెందిన పలువురు విశాఖపట్నంలోని రైల్వే నార్త్ డివిజనల్ ఇంజినీర్ రమణను కోరారు. సోమవారం కొత్తవలసకు చెందిన శేఖర్, దేవకోటి శంకరరావు, ఉమామహేశ్వరరావు ఆయన్ని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పార్వతీపురంలోని కొత్తవలస, చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు అండర్ గ్రౌండ్ మార్గం పనులు చేపట్టేందుకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని బదులిచ్చారన్నారు. నెల రోజుల్లోపు పనులను ప్రారంభిస్తామని చెప్పారని ఇంజినీర్ రమణ చెప్పారని వారు వివరించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

నెల్లిమర్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల సీహెచ్‌ఎన్‌సీలో ఇటీవల తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు నిరసనగా సోమవారం ఉదయం నెల్లిమర్ల సీహెచ్‌ఎన్‌సీ దగ్గర ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ సీహెచ్‌ఎన్‌సీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బకాయి ఉన్న 2 నెలల జీతాలు, పీఎఫ్ డబ్బులు కాంట్రాక్టర్లతో ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెరిగిన జీతాలు ప్రతి నెల 10వ తేదీలోపు ఇప్పించి, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ● నెల్లిమర్ల సీహెచ్‌ఎన్‌సీ సూపరింటెండెంట్ తిరుమలదేవి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అశోక్ ఆరోపించారు. ఆమె సమయానికి ఆసుపత్రికి విధులకు హాజరు కాకపోయినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు నడుపుతూ ప్రభుత్వ వైద్యాధికారులుగా విధులు నిర్వర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నెల్లిమర్ల మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు మొయిద పాపారావు సంఘీభావం తెలిపారు. శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా..

● నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



డెంకాడ: పీహెచ్‌సీ వద్ద నిరసన చేస్తున్న వైద్య సిబ్బంది

డెంకాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా డెంకాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు, సీహెచ్‌వో ఏసయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ సుహాసిని, హెల్త్ సూపర్‌వైజర్ గురుభక్తులు, హెల్త్ విజిటర్ ఎంఎస్‌పీ రాణి, స్టాఫ్ నర్సు మీనాకుమారి, ఫార్మసిస్టు అప్పలనాయుడు, ఎల్టీ గోవింద్ పాల్గొన్నారు. ● మెరకముడిదాం: ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ ముందు నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ● భోగాపురం: పోలిపల్లి గ్రామంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

కుమార్తె పెళ్లి చూడకుండా అనంతలోకాలకు..

● ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జియ్యమ్మవలస, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): చినకుదమ, పెదకుదమ గ్రామాల మధ్య గౌరీపురం జంక్షన్ వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొనడంతో పెదకుదమ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణ(48) మృతిచెందారు. ఈ ఘటనపై చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెదకుదమ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణ వేకువజామున చినకుదమ వెళ్లి తిరిగి వస్తుండగా పెదమకుద - చినకుదమ గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతడిని ఢీకొంది. విషయాన్ని గమనించిన స్థానికులు 108 వాహనంపై క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మృతుడికి భార్య గంగ, కుమారుడు కుమార్, కుమార్తె సునీత ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడు నాగభూషణ కుమార్తె సునీతకు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 12న గోధుమరాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమార్తె పెళ్లి చూడకుండా కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

వివాహిత ఆత్మహత్య

రాజాం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటలో సోమవారం చోటుచేసుకుంది. దీనిపై రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఔరంగాబాద్‌కు చెందిన మహమ్మద్ జఫిన్ గత 17 ఏళ్లుగా రాజాం ప్రాంతంలో ఉంటూ మార్బుల్స్ వర్క్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఐదేళ్ల కిందట బీహార్‌కు చెందిన హీనా పర్వీన్‌ను పెళ్లి చేసుకున్నాడు. వీరు రెండేళ్ల నుంచి డోలపేటలో ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. ఇటీవల హీనాకు ఆరోగ్యం బాగోలేదు. ఈనెల 12న ఆమె మందులు వేసుకోలేదు. దీంతో జఫిన్ సోమవారం ఉదయం ఆమెను మందలించాడు. ఆ తర్వాత పనుల కోసం బయటకు వెళ్లిపోయాడు. తిరిగి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటికి చేరేసరికి.. భార్య ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని, మృతిచెంది ఉంది. దీంతో జఫిన్ రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. ● ఇదిలా ఉంటే మృతురాలి కుటుంబ సభ్యులు హీనాది ఆత్మహత్య కాదని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు బీహార్ నుంచి వచ్చేంత వరకూ హీనా మృతదేహాన్ని రాజాం ఏరియా ఆసుపత్రిలో ఉంచే ఏర్పాట్లు చేశామని సీఐ తెలిపారు. జఫిన్, హీనా దంపతులకు ఇద్దరు పిల్లలు. పెద్దకొడుకు వసీం బీహార్‌లో ఉండగా.. రెండో కుమారుడు కాసిం డోలపేటలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

మా అబ్బాయిని చంపి బావిలో పడేశారు

చీపురుపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ కుమారుడు ఎలకల రామును హత్య చేసి, నేలబావిలో పడేశారని పత్తికాయవలసకు చెందిన ఎలకల రమేష్, సింహాచలం అనే దంపతులు ఆరోపించారు. ఇటీవల పుర్రేయవలస సమీపంలో ఇటుక బట్టీ వద్ద నేలబావిలో రాము మృతదేహం తేలియాడింది. ఈ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. తమ కుమారుడు రాము.. ఓ ఎక్స్‌కవేటర్ యజమాని వద్ద నాలుగేళ్ల నుంచి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. ఎప్పటిలాగే రాము ఈనెల 8న ఉదయాన్నే ఇటుక బట్టీ వద్దకు విధుల కోసం హాజరయ్యాడన్నారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి రావాల్సి ఉండగా రాలేదన్నారు. ఎక్స్‌కవేటర్ యజమానిని వాకబు చేయగా, రాము బాతువ వెళ్లినట్టు చెప్పారన్నారు. ఆ మరుసటి రోజు ఈనెల 9న ఉదయాన్నే ఎక్స్‌కవేటర్ యజమాని తమకు చెప్పకుండా గ్రామంలోని వేరే వ్యక్తికి ఫోన్ చేసి రాము కనిపించడం లేదని, అతడు వినియోగించే ద్విచక్ర వాహనం ఇటుక బట్టీ వద్ద ఉందని సమాచారం ఇచ్చారన్నారు. అయితే తాము అడిగే ప్రశ్నలకు ఆయన పొంతన లేని సమాధానం ఇస్తున్నారన్నారు. తమ కుమారుణ్ణి ఆయనే చంపి, నేల బావిలో పడవేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గరివిడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలోని టీచర్స్ కాలనీ గల వాటర్ ట్యాంకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లిపేట గ్రామానికి చెందిన చింతపల్లి పవన్(22) అనే యువకుడు మృతిచెందాడు. పవన్‌తోపాటు అతని స్నేహితుడు నాగరాజు చీపురుపల్లి నుంచి గరివిడి వైపు బైకుపై వేగంగా వస్తున్నారు. వాటర్ ట్యాంకు ఎదురుగా వచ్చేసరికి బైకు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో బైకు వెనుకన కూర్చున్న పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవన్ అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. బైకు నడిపిన నాగరాజు స్వల్ప గాయాలు కావడంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. పవన్ అతని సోదరుడుతో కలిసి గరివిడిలో ఒక రెస్టారెంట్ నడుపుతున్నాడు. పవన్ మృతి పట్ల తండ్రి నాగరాజు, తల్లి గౌరిలు కన్నీటి పర్యాంతమయ్యారు. గరివిడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోగస్ పింఛన్లపై విచారణ

రేగిడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉణుకూరు గ్రామంలో 32 మంది అనర్హులు తప్పుడు పత్రాలు సృష్టించి పింఛన్లు పొందుతున్నారన్న అభియోగంపై ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంఈవో వరప్రసాదరావులు సోమవారం విచారణ నిర్వహించారు. ఇటీవల ఈ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గేదెల బాల మురళీధర్, పోరెడ్డి విశ్వానాథంలు బోగస్ పింఛన్లపై స్థానిక ఎమ్మెల్యే గ్రీవెన్స్, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంఈవోతో పాటు ఉంగరాడ ఫిషరీస్ అసిస్టెంట్ నారాయణరావు స్థానిక సచివాలయంలో విచారణ చేశారు. మత్స్యకారులు కాని ఎనిమిదిమంది తప్పుడు పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్టు, మరి కొంతమంది ఆధార్ అప్‌డేట్‌తో వృద్ధాప్య పింఛన్లు కాజేస్తున్నట్టు తనిఖీ అధికారుల దృష్టికి వెళ్లింది. అలాగే అభియోగం చేసినవారి ధ్రువపత్రాలను కూడా అధికారులు పరిశీలించారు. వీటిపై సమగ్ర విచారణ చేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరీ, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా?

బొండపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన జెండర్ రిసోర్సు సెంటర్ ప్రారంభంతోపాటు నెలివాడలో ఈనెల 10న నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవానికి తనతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ఎంపీపీ చల్లా చలంనాయుడు ప్రశ్నించారు. బొండపల్లిలోని తన చాంబర్‌లో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 10వ తేదీన మంత్రి శ్రీనివాస్ చేతులమీదుగా ఈ రెండు కార్యక్రమాలను నిర్వహించగా, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానించలేదని, ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

చిల్లపేట రహదారికి మోక్షం

విజయనగరం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలోని చిల్లపేట రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సోమవారం ఉదయం ఆ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, విజయనగరం ఏఎంసీ చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గంటా పోలినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అల్ట్రా రన్నింగ్ చాంపియన్‌షిప్ కోచ్‌గా హేమంత్



హేమంత్

చీపురుపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లికి చెందిన కంది హేమంత్ కుమార్ 24 గంటల అల్ట్రా రన్నింగ్ చాంపియన్ షిప్ పోటీలకు కోచ్‌గా ఎంపికయ్యారు. మండలంలోని పుర్రేయవ లసకు చెందిన కంది హేమంత్ గత కొంత కాలంగా ఎయిర్‌ఫో ర్స్‌లో సేవలు అందజేస్తున్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో ఫ్రాన్స్‌లో 24 గంటల అల్ట్రా రన్నింగ్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు మన దేశం తరఫున ఆరుగురు మహిళలు, ఆరుగురు పురుషులు పాల్గొంటున్నారు. వీరికి మరో ఆరుగురు క్రూ అండ్ కోచ్‌లుగా వ్యవహరిస్తారు. ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న హేమంత్‌కు ఈ ఆరుగురిలో చోటు దక్కింది.

నడక మైదానాన్ని మెరుగుపర్చాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని 42వ డివిజన్ పరిధిలో ఉన్న నడక మైదానంలో వ్యాయామ పరికరాలు ఏర్పాటుచేయాలని కోరుతూ అంజనీపుత్ర వాకర్స్ క్లబ్ సభ్యుడు సాయికృష్ణ సోమవారం స్థానిక నగర నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్యకు వినతిపత్రం అందజేశారు. మైదానం చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని క్లబ్ సభ్యులు కోరారు.

'శుద్ధ' అబద్ధం!

(ఐదో పేజీ తరువాయి)

అనుమానించి వాడకపోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భ జలాన్ని శుద్ధి చేసే సమయంలో ఫిల్ట్రేషన్, ఏరేషన్, కార్బన్ ఫిల్ట్రేషన్ ఇలా 12 రకాల శుద్ధి ప్రక్రియలు నిర్వహించాలి. జిల్లాలో ఇవెక్కడా జరుగుతున్న దాఖలాలు లేవు. శుద్ధ జలకేంద్రం నిర్వహణలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి. కనీస స్థాయిలో కూడా నిబంధనలు అమలుకావడం లేదన్న విమర్శలున్నాయి. ఐఎస్‌వో ప్రమాణాలు ప్రకారం సీసాలు, క్యాన్లను పాలీ ఇథలిన్, పాలీ వినైల్ క్లోరైడ్, పాలీ ప్రొఫిన్లతో తయారైనవి మాత్రమే వాడాలి. కానీ జిల్లాలో ప్లాస్టిక్‌తో తయారుచేసిన సీసాలు, క్యాన్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని 48 గంటల తరువాత మాత్రమే క్యాన్లు, సీసాల్లో వేయాలి. ఈ ప్రక్రియ వెంటనే చేపట్టడం వల్ల దాని గాఢత పడిపోతుంది. ఈ నీరు తాగడం వల్లే గొంతు సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి.

అధిక ధరలకు విక్రయాలు..

ఆర్వో ప్లాంట్ల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. ఎటువంటి శుద్ధి చేయకుండానే నీటిని సీసాలు, క్యాన్లతో నింపుతున్నారు. వాటినే రూ.30ల వరకూ విక్రయిస్తున్నారు. నీటి వ్యాపారం ఒక మాఫియాగా మారిపోయింది. విజయనగరంలాంటి చోట అపార్ట్‌మెంట్లు ఎక్కువ. వాటికి శుద్ధ జలాలు అందించాలంటే ధర అధికం. ఎందుకంటే అపార్ట్‌మెంట్ మెట్లు ఎక్కి అందించాల్సి ఉంటుంది. దీంతో 20 లీటర్ల క్యాన్‌ను రూ.50 వరకూ విక్రయిస్తున్నారు. నాణ్యత పాటించకపోవడంతో ప్రజలు అనారోగ్యాన్ని కొనుక్కున్నట్టు అవుతోంది. శుద్ధ జలాల్లో నీటి సాంద్రత విలువలు అధికం. అయితే కనీస స్థాయిలో కూడా శుద్ధి చేయకపోవడంతో నీటి సాంద్రత విలువలు పడిపోతున్నాయి. మినరల్స్‌లో వ్యత్యాసం కూడా ఉంటోంది. సమతుల్యం పాటించక పోవడంతో నీరు మరింత పాడవుతోంది. ఆ నీరు తాగడం వల్ల నరాలు, ఎముకలు, జ్ఞాపకశక్తి, దంత, కిడ్నీ, చర్మసంబంధిత వ్యాధులు సంక్రమిస్తున్నాయి. తల వెంట్రుకలు సైతం రాలిపోతున్నాయి. రోగ నిరోధక శక్తి తగ్గముఖం పడుతోంది. అందుకే ఆర్వో ప్లాంట్ల నీటిని విని యోగిస్తున్న వారు ఒకటికి రెండుసార్లు ఆలోచించి వాడుకోవడం ఉత్తమం. నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్లపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది.

దృష్టిపెడతాం..

జిల్లాలో ఆర్వోప్లాంట్లపై ప్రత్యేకంగా దృష్టిపెడతాం. నిబంధనలు పాటించని వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నిత్యం తనిఖీ చేసేలా అధికారులకు ఆదేశాలిస్తాం. ఎక్కడైనా నిబంధనలు పాటించక పోతే ప్రజలే నేరుగా ఫిర్యాదుచేయాలి. అన్నిశాఖల అనుమతులు పొందని వారిపై చర్యలు ఉంటాయి.

- రామసుందర్ రెడ్డి, కలెక్టర్

ఆ నిబం'ధన' అమలేదీ?

(ఐదో పేజీ తరువాయి)

ఇతర ఆస్తుల అమ్మకం, కొనుగోలుదారుల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ స్టాంప్ డ్యూటీ వసూలు చేస్తుంది. కొనుగోలు, అమ్మకం జరిగిన భూమి విలువలో 6.5 శాతం సర్‌చార్జీ కింద తీసుకుంటారు. ఇందులో 5శాతం ప్రభుత్వ ఖజానాకు, మిగిలిన 1.5శాతంలో అయిదింట మూడోంతులు పంచాయతీలకు, ఒక వంతు మండల పరిషత్తుకు, ఒక వంతు జిల్లా పరిషత్‌కు బదిలీ చేయాలి. 2023-2024 నుంచి ఇంతవరకు ఈ నిధుల సర్దుబాటు జరగనట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు వచ్చే వాటా సొమ్మును అభివృద్ధి పనులతో పాటు పంచాయతీకి అవసరమైన అన్నింటికీ ఖర్చుపెట్టుకొనే అధికారం ఉంది. కానీ ఆ నిధులు ఇవ్వడం లేదు.

● జిల్లాలో శృంగవరపుకోట, కొత్తవలస, చీపురుపల్లి, గజపతినగరం మేజర్ పంచాయతీలు పట్టణ రూపురేఖలతో కనిపిస్తున్నాయి. కాలనీలు విస్తరిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణకు కార్మికులు 30 నుంచి 70 మంది వరకు అవసరమవుతున్నారు. వీరికి సకాలంలో జీతాలు చెల్లించక పోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది.

పట్టించుకోని వీఎంఆర్‌డీఏ

విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) పరిధిలో జిల్లాలోని అత్యధిక శాతం పంచాయతీలున్నాయి. వీటిలో ఎటువంటి భవన నిర్మాణాలు చేపట్టాలన్నా నిబంధనల ప్రకారం వీఎంఆర్‌డీఏకు రుసుం చెల్లించాలి. పంచాయతీల్లో రూపుదిద్దుకుంటున్న లేఅవుట్‌లకు వీఎంఆర్‌డీఏ అనుమతులు ఉంటేనే చట్టబద్ధత ఉంటుంది. ఇలా పంచాయతీల్లో ఉన్న ఆస్తుల నుంచి వీఎంఆర్‌డీఏ ఆదాయాన్ని పొందుతోంది. అందులో నుంచి పంచాయతీల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు కేటాయించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నారా?

(ఐదో పేజీ తరువాయి)

శిబిరాలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించినట్లు విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం అయినట్లు గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన దివ్యాంగుడు కరక వెంకటరమణ కొద్దిరోజుల కిందట పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగి పేరున రూ.2 లక్షలు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఓ వ్యక్తి పేరున రూ.2లక్షలు డ్రా చేసి స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఆశయ్య వద్ద ప్రస్తావించగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కోసం ఖర్చు చేశామన్నారు. నిధులు ఎక్కడా పక్కదారి పట్టలేదని, ఇంకా కొంత డబ్బులు ఉన్నాయన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

తెర్లాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. అమిటి-తెర్లాం మధ్య సుమారు 3 కిలోమీటర్ల రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యేతో పాటు బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శంకుస్థాపన చేశారు. అమిటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు కరణం రమేశ్, యుగంధర్, శంకరరావు, సురేష్, శశిభూషణ రావు, సర్పంచ్ కరణం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాడాడ-చినవాడాడ రోడ్డుకు..

●బాడంగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వాడాడ-చిన వాడాడ మధ్య తారురోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బేబీనాయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్య మిస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. పల్లెల్లో అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ చినవాడాడ ప్రజల చిరకాల కోరిన నెరవేరిందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

పెదశెలగాంలో వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రామభద్రపురం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): పెదశెలగాం గిరిజన గ్రామంలో సోమవారం వైద్య బృందం పర్యటించింది. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'టీబీ లక్షణాలతో వివాహిత మృతి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి అపర్ణ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య బృందం ఇంటింటా సందర్శించింది. టీబీ సూపర్‌వైజర్ శ్రీదేవి సమక్షంలో 125 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో 20 మందికి రక్త పరీక్షలు నిర్వహించి పీహెచ్‌సీకి రిఫర్ చేశారు. గ్రామంలో క్షయవ్యాధి ఉన్న వారందరికీ మందులు పంపిణీ చేస్తామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కలుషితమైన నీరు తాగవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మంగమ్మ, హెల్త్ అసిస్టెంట్ మధు, ఆశావర్కర్ పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పారదర్శకంగా సర్వే నిర్వహించండి



మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఆర్థిక పురోగతి కోసం నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెస్‌మెంట్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. వందశాతం ఇంటింటా సర్వే పూర్తి చేసి ప్రతీ నిర్మాణానికి అసెస్‌మెంట్‌తో పన్ను విధించాలన్నారు. ఇదివరకే ఉన్న అసెస్మెంట్లకు అడిషనల్ ఆల్టరేషన్ ఉంటే అందుకు అవసరమైన నిబంధనలతో పన్ను విధించాలన్నారు. విధుల్లో ఎవరూ అలసత్వం చూపరాదని హెచ్చరించారు. సమావేశంలో ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 24 వినతులు



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఏపీవో

సీతంపేట రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 24 వినతులు అందాయి. నాటు కోళ్ల పెంపకానికి షెడ్డు మంజూ రు చేయాలని రంకిణి గ్రామానికి చెందిన సుశీల వినతిపత్రం అందజేసింది. . శ్రీకాకుళం పోస్టుమెట్రిక్ వసతిగృహంలో సీటు ఇప్పించాలని మామిడి మానుగూడ గ్రామానికి చెందిన ఆరిక ప్రశాంతి కోరింది. భామిని మండలంలోని సతివాడ నుంచి జక్కరగూడ వరకు బీటీ రహదారి నిర్మించాలని సవర అడ్డాయి వినతి అందజేశారు. అటెండర్ పోస్టు, కుట్టు మిషన్, చేప పిల్లలు, పవర్ టిల్లర్ మంజూరు చేయాలని సవర అడ్డాయి, రమేష్, గంగారావు, సరస్వతి కోరారు. గాదెలంకలో వరదగోడ నిర్మించాలని జీవన్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. పీజీఆర్ ఎస్‌లో పీహెచ్‌వో ఆర్‌పీ గణేష్, డీడీ అన్నాదొర, టిడబ్ల్యూ ఈఈ రమాదేవి, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు పాల్గొన్నారు.

పింఛన్ కోసం..

●సీతంపేట రూరల్, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న నిమ్మక అమావాస్యకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని గడిగుడ్డి గ్రామానికి చెందిన నిమ్మక దుర్గారావు, లక్ష్మి కోరారు. సోమవారం ఐటీడీఏలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అమావాస్యను కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. గత ఏడాది డిసెంబరు నుంచి వికలాంగ పింఛన్ నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. పింఛన్‌ను పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తెలిపారు. సామవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటలలోగా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు అదేరోజు సాయంత్రం 4 గంటలలోగా తమ నమోదు యూనిక్ నెంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా ధ్రువీ కరణ చేయించుకుని ఆమోదం పొందాలన్నారు. అలా అప్రూవల్ చేసుకున్న అభ్యర్థుల పేర్లు మాత్రమే మెరిట్‌లిస్ట్‌లో ప్రదర్శిస్తా మన్నారు. ఈనెల 17న ఉదయం 10గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సీతంపేట ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజ రుకావాలన్నారు. ఇతర వివరాలకు 7569062449, 9491134464 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవిన్యూ డివిజన్ పరిధిలో బాణసంచా విక్రయాలు జరిపేందుకు అనుమతి పొందిన వారంతా కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో బాణసంచా విక్రయించేందుకు తాత్కాలిక లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు తమ దుకాణాల వద్ద వాటర్ డ్రమ్స్, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల మధ్య ఖాళీ స్థలం ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని ఆర్డీవో స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

బొబ్బిలి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు ద్వారకానగర్‌లో సీసీ రోడ్డు పనులకు సోమవారం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భం గా చైర్మన్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సకా లంలో రోడ్డు పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు కె.లక్ష్మీసత్యనారాయణ, ఏఈ కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్షా మాలధారణ



మాలధారణ చేస్తున్న భక్తులు

బొబ్బిలి, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూల్‌బాగ్ శివ సన్నిధానంలో సోమవారం దాదాపు వందమంది శివ దీక్షా మాలధారణ చేశారు. గురుస్వాములు కర్రోతు రాములప్పన్న, బొత్స అప్పులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సాలూరుకు చెందిన సీనియర్ గురుస్వామి దీక్షాధారులకు మాలధారణ చేశారు.

జాబ్‌మేళాలో 113 మంది ఎంపిక

సాలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభు త్వ ఐటీటీలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 113 మంది వివి ధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మేళాకు 198 మంది హాజర య్యారని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసా చారి తెలిపారు. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌కి 38 మంది, పాటిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 28 మంది, డిమార్ట్, ఫ్లిప్‌కార్డు, అమెజాన్‌కు 16 మంది, హీరో కంపెనీ కి 20మంది ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమం లో ప్లేస్‌మెంట్ అధికారి కోట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'గురుబిల్లి'

పాలకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడిగా గురుబిల్లి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సోమ వారం పాలకొండలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమా వేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు గూ దూరు వెంకటేశ్వరరావు హాజరై.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కమిటీను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనపాక ధనుంజయరావు, పాలకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా గురుబిల్లి దిలీప్‌కుమార్, పాలకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా శాసపు తిరుపతి రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమం లో బీసీ యువత, విద్యార్థులు, పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు రేపు

సీతంపేట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుప త్రిలో ఈనెల 15న ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ వ్యాధి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలను జెమ్స్ ఆసు పత్రి వైద్య సిబ్బంది నిర్వహిస్తారని తెలిపారు.

ఉప్పొంగిన ఏడొంపుల గెడ్డ

● రెండు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



ఉధృతంగా ప్రవహిస్తున్న ఏడొంపులగెడ్డ

రామభద్రపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాతరేగ, కొత్తరేగ గ్రామాల మధ్య ఏడొంపుల గెడ్డ సోమవారం ఉప్పొంగడంతో రెండు గ్రామాల రాకపోకలు స్తంభించాయి. దీంతో కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో భారీ వర్షాలు కురవడంతో ఏడొంపులగెడ్డలో నీటి ప్రవాహం పెరిగింది. ఏటా ఈ వర్షాకాలంలో ఈ సమస్య తలెత్తుతోందని, ఇక్కడ కాజ్‌వే నిర్మాణం చేయాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోతోందని కొత్తరేగ గ్రామానికి చెందిన కోట అప్పలనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు.

నకిలీ మద్యంపై వైసీపీ ఆందోళన

బొబ్బిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్య విక్రయాలను ని రసిస్తూ స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ నకిలీ మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. నకిలీ మద్యానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని ఆరోపించారు. అనంతరం సీఐ చిన్నంనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, సావు వెంకట మురళీ కృష్ణారావు, చోడిగంజి రమేశ్‌నాయుడు, బొద్దల సత్యనారాయణ, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, గొలగాని రమాదేవి పాల్గొన్నారు.

వీవోఏను తొలగించడం తగదు



మాట్లాడుతున్న శంకరరావు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పారాదికి చెందిన వీవోఏ ఉత్తరావల్లి ఉమావెంకటేశ్వరిని రాజకీయ కారణాలతో తొలగించడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అన్నారు. సోమవారం పొదుపు సంఘాల మహిళలతో కలిసి వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా నిజాయితీగా పనిచేస్తున్న వీవోఏకు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమ న్నారు. వీవోఏ తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే జిల్లా అంతటా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఏపీఎం భాగ్యలక్ష్మికి వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాల్, వీవోఏలు భవాని, బంగారమ్మ, చైతన్య, ఇందిర, లలితదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

17న ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్

బొబ్బిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 17న ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహించ నున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ బి.పోతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో భాగంగా సోమవారం మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గూగుల్ రాకతో టెక్‌హబ్‌గా విశాఖ



ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం గూగుల్ రాకతో విశాఖ టెక్ హబ్‌గా మారనుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి ఇదొక చారిత్రక మైలురాయి అన్నారు. రాష్ట్రానికి గ్లోబల్ కంపెనీలను తీసుకు రావాడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు.అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖలో ఏఐ, టెక్‌హబ్, తిరుపతిలో ఎలక్ట్రానిక్ హబ్, ఇవన్నీ ఏపీ అభివృద్ధికి నాంది పలుకుతున్నాయని ఆమె వివరించారు.

'తూర్పుకాపు' జిల్లా అధ్యక్షుడిగా చౌదరి

పాలకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు సం క్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాలకొండకు చెందిన కనపాక చౌదరి నాయుడును నియమితులయ్యారు. విజయవాడలో సోమ వారం తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు చంద్ర మోహన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమావేశంలో మన్యం జిల్లా అధ్యక్షుడిని నియా మకం జరిగింది.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోండి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి క్షేత సహాయకులు నిర్దేశత లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏపీవో లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆయన మాట్లాడుతూ పండ్ల మొక్కలు, ఫాంపాండ్స్ పనులు, కందకాల పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. గ్రామాల్లో వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. బీమా సౌకర్యం కల్పించడానికి చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రతి వేతనదారుడికి వంద రోజులు పని కల్పించాలన్నారు. పనుల దస్త్రాలు, జాబ్ కార్డులు ఎప్పటికప్పుడు నవీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో జేఈ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

